సాక్షి
వరంగల్

మంగళవారం | 21 | మార్చి | 2023



టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు అన్నారు. - 8లో▸



ప్రభుత్వ ఖజానాకు టోకరా..

నకిలీ వే బిల్లులు సృష్టించి ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయలు గండికొట్టిన ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసినట్లు వరంగల్ సీపీ రంగనాథ్ తెలిపారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32°/19°

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



వర్ధన్నపేట: వర్ధన్నపేట పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలోని కల్యాణ మండపంలో సోమవారం అలువేలు మంగ, పద్మావతి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం శేషం సంపత్‌కుమార్ చార్యులు, ఫణికుమారచార్యులు, అచ్చుత్‌కుమారచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా కల్యాణం నిర్వహించారు. స్వామివారికి కన్యాదాతలుగా భక్తులు వ్యవహరించగా మంగళసూత్రధారణ, తలంబ్రాలు, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహాఅన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేషం వెంకటరమణచార్యులు, కలకోట రామాచార్యులు, పాలకుర్తి సారంగపాణి, సుజాత దంపతులతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

471 మంది విద్యార్థులు గైర్హాజరు



కాళోజీ సెంటర్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్ష మ్యాథమెటిక్స్, బోటనీ, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులకు సోమవారం నిర్వహించారు. జిల్లాలో 27 పరీక్ష కేంద్రాల్లో 7,388 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 6,917 మంది విద్యార్థులు హాజరు కాగా 471 మంది గైర్హాజరు అయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి కాక మాధవ రావు తెలిపారు. జనరల్ కోర్సులో 247, ఒకేషనల్ కోర్సులో 124 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు వివరించారు.

100 మి.మీ వర్షపాతం నమోదు

వరంగల్ రూరల్: జిల్లాలో సోమవారం 100 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయిందని జిల్లా ముఖ్యప్రణాళికాధికారి గుర్రాల జీవరత్నం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యధికంగా నర్సంపేట మండలంలో 28.4 మిల్లీ మీటర్లు, చెన్నారావుపేటలో 23.2, ఖానాపూర్‌లో 16.6, సంగెంలో 9.8, దుగ్గొండిలో 9.6, నల్లబెల్లిలో 5.6, నెక్కొండ మండలంలో 4.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు అయిందన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి



వర్ధన్నపేట: పేపర్ లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వర్ధన్నపేట పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 30 లక్షల నిరుద్యోగ యువకుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడి వారి జీవితాలను వీధుల్లో నిలిపిందని విమర్శించారు. కేవలం బీఆర్‌ఎస్ నేతలకు, నాయకులకు కవిత లిక్కర్ కేసు నుంచి ఎలా బయటపడాలి, రాష్ట్రాన్ని ఇంకా ఎలా దోచుకోవాలని అన్న యావ తప్ప తెలంగాణలోని ప్రజలు, నిరుద్యోగులు, యువత, సామాన్య జనంపై పట్టింపు లేదన్నారు. ఇప్పటికైనా సిట్టింగ్ జడ్జిచేత విచారణ చేపట్టాలని, ఇందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముత్తిరెడ్డి కేశవరెడ్డి, గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, బన్న ప్రభాకర్, చీటూరి రాజు, కొండేటి సత్యం, రాయపురం కుమారస్వామి, పెద్దూరి రాజ్‌కుమార్, ఐత రవికుమార్, బోంపెల్లి దేవేందర్ రావు, తేజా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ అదుపులో ఆర్‌ఎంపీ?

ఖిలా వరంగల్: కరీమాబాద్ ప్రాంతంలో ఆర్‌ఎంపీగా చలామణి అవుతున్న ఓ వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెండు రోజుల క్రితం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వైద్యపరమైన సర్టిఫికెట్లు లేకుండానే రోగులకు వైద్య సేవలందిస్తూ.. థైరాయిడ్‌కు నాటు మందు ఇస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో దాడి చేసి ఆయనను పట్టుకున్న మిల్స్ కాలనీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం

సీపీఆర్‌కు సిద్ధం

- జిల్లాలో పీహెచ్‌సీల వారీగా శిక్షణ
- ఇటీవల మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో ప్రారంభం
- గుండెపోటు నివారణ చర్యలపై ప్రభుత్వం దృష్టి
- క్షేత్రస్థాయి శిక్షణకు మాన్‌కిన్ బొమ్మల కొరత



సీపీఆర్ అవగాహన కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, తదితరులు (ఫైల్)

సాక్షి, వరంగల్: అనుకోకుండా వచ్చే కార్డియాక్ అరెస్టు, గుండెపోటుతో చాలామంది అక్కడికక్కడే కుప్పకూలి గుండె ఆగి మరణాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. అప్పటికప్పుడు ప్రాణాలు నిలిపే కార్డియో పల్మనరీ రీససిటేషన్ (సీపీఆర్) విధానంపై క్షేత్రస్థాయిలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా అన్ని వయసుల వారికి అత్యవసర సమయాల్లో గుండె పదిలంగా ఉంచి ప్రాణాలు కాపాడేందుకు సీపీఆర్ విధానంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు జిల్లా వైద్యారోగ్య విభాగం సిద్ధమైంది. దాదాపు 1,200 మంది ఆశవర్కర్లు, సూపర్‌వైజర్లతో పాటు పీహెచ్‌సీ, ఇతర సిబ్బందికి మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ ఇవ్వనుంది. కార్డియాక్ అరెస్టుతో పాటు గుండెపోటు వచ్చిన సందర్భంలో కుప్పకూలిపోయే వ్యక్తులకు అప్పటికప్పుడు సీపీఆర్ ఎలా చేసి ప్రాణాలు నిలపవచ్చనే దానిపై శిక్షణ ఇవ్వనున్నారు. దీనివల్ల అత్యవసర సమయంలో వేలాది మంది ప్రాణాలు కాపాడే అవకాశముంది.

ఇతర శాఖల భాగస్వామ్యంతో..

సీపీఆర్ విధానంపై శిక్షణ ఇచ్చేందుకు ఎక్కువగా ప్రజల తాకిడి ఉండే విభాగాలైన మున్సిపల్, పోలీస్ విభాగాలు, ప్రజలకు సేవ చేసే స్వచ్ఛంద సేవా సంస్థ (ఎన్జీఓ)లను కూడా భాగస్వామ్యం చేయనున్నారు. వీరంతా పంచాయతీ, మున్సిపాలిటీ పరిధిలో ఉండే వారికి శిక్షణ ఇస్తారు. జిల్లా కలెక్టరేట్‌లో వైద్యారోగ్య విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సీపీఆర్ శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో పాటు ఇతరులు ప్రారంభించారు. అయితే సీపీఆర్ శిక్షణకు అవసరమైన మాన్‌కిన్ బొమ్మలు ప్రభుత్వం నుంచి రాకపోవడంతో ఓ ప్రైవేట్ వైద్యుడి నుంచి తెప్పించి ఈ సీపీఆర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మాన్‌కిన్ బొమ్మల కొరత

సీపీఆర్ శిక్షణలో ముఖ్యంగా అవసరమైనవి మాన్‌కిన్‌లు. ఇవి మనిషి శరీరాల మాదిరిగా పోలి ఉండే బొమ్మ. ఈ బొమ్మను ఉపయోగించి సీపీఆర్ ఎలా చేయాలన్న దానిపై శిక్షణ ఇస్తారు. రూ.20 వేల నుంచి రూ.లక్ష వరకు విలువ ఉండే ఈ మాన్‌కిన్‌లు ఇంకా ప్రభుత్వం నుంచి జిల్లాకు రాకపోవడంతో శిక్షణ ఇచ్చే వైద్యులు ఎదురుచూస్తున్నారు. ఈ కార్యక్రమం అధికారికంగా ప్రారంభించినా.. ఇంకా మాన్‌కిన్‌లు సర్కార్ నుంచి రాకపోవడంతో ఎదురు చూపులు తప్పడం లేదు. హైదరాబాద్‌లో సీపీఆర్‌పై ప్రత్యేక శిక్షణ తీసుకున్న నలుగురు మాస్టర్ ట్రైనర్లు డాక్టర్ సుమన్, కె.విజయ్ కుమార్, ఆచార్య పేత్రి, దిలీప్‌లు శిక్షణ ఇచ్చేందుకు ఎదురు చూస్తున్నారు. మాన్‌కిన్‌లు ఎప్పుడు వస్తే అప్పుడు శిక్షణ ఇచ్చేందుకు సిద్ధం చేసుకున్నారు.

మాన్‌కిన్‌లు రాగానే..

జిల్లాలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై శిక్షణ ఇవ్వనున్నాం. ప్రభుత్వం నుంచి మాన్‌కిన్‌లు రాగానే సీపీఆర్ శిక్షణ ఉంటుంది. అనుకోకుండా వచ్చే కార్డియాక్ అరెస్టు, గుండె పోటుతో మనుషులు కుప్పకూలిపోతున్నారు. అప్పటికప్పుడు సీపీఆర్ చేయడం వల్ల ప్రాణాలు నిలిపే అవకాశం ఉంది. ఓ వైపు సీపీఆర్ చేస్తూనే.. ఇంకోవైపు అక్కడున్న వారి సాయంతో 108కు కాల్ చేయాలి. ఆ వాహనం వచ్చేలోపు సీపీఆర్ ద్వారా వారికి తిరిగి శ్వాస ప్రారంభమైతే...ఆస్పత్రికి తీసుకెళ్లి మెరుగైన చికిత్స అందించి ప్రాణాలు నిలిపే అవకాశం ఉంది.

డాక్టర్ వెంకటరమణ, జిల్లా వైద్యాధికారి

'మన ఊరు-మన బడి' పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ రూరల్: మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మన ఊరు– మన బడి పనులపై అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ, డీఈఓ డి. వాసంతి, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను మండల స్పెషల్ ఆఫీసర్లు, మండల విద్యాశాఖాధికారులు ప్రతి పాఠశాలను సందర్శించి పనుల పురోగతి వివరాలను వాట్సాప్ గ్రూపులో పోస్టు చేయాలని సూచించారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్థలంలో స్థానిక సర్పంచ్, ఏఈ, హెచ్‌ఎంలు సృజనాత్మకంగా ఆలోచించి మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దాలన్నారు. ఈనెల 31వ తేదీ లోగా పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

'ఎర్త్ అవర్'ను విజయవంతం చేయాలి

మార్చి నెల చివరి శనివారంలో నిర్వహించే ఎర్త్ అవర్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎర్త్ అవర్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ గృహాలు, వ్యాపార కేంద్రాలు, ఇతర కార్యాలయాల్లో మార్చి చివరి శనివారం (25వతేదీ) రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు కలిసి కట్టుగా గంట పాటు విద్యుత్‌ను ఆపి సంఘీభావం తెలపాలన్నారు. కార్యక్రమంలో డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ప్రాజెక్టు ఆఫీసర్ హర్షశంకర్, పరశురాములు, ఇన్నారెడ్డి ప్రజ్వల్ పాల్గొన్నారు.

బాధ్యతగా వ్యవహరించండి

- డీఆర్‌డీఓ సంపత్ రావు

నల్లబెల్లి: ఉపాధి హామీ పథకంలో ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా ఈజీఎస్ అధికారులు, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని డీఆర్‌డీఓ సంపత్ రావు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ 14వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక సోమవారం జరిగింది. ఈ ప్రజా వేదికలో డీఆర్‌డీఓ సంపత్ రావు, అడిషనల్ డీఆర్‌డీఓ వసుమతిలు గ్రామాల వారీగా నివేదికలపై చర్చించారు. మండలంలో రూ.6.40 కోట్ల మేర పనులు జరుగగా.. అక్రమాలకు పాల్పడిన అధికారులు, సిబ్బందికి సుమారు రూ.10 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న వారందరికి పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని, వేతనాలు సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. పనులకు రావడానికి ఆసక్తి లేనివారు పని అవసరం లేదని తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఊడుగుల సునిత, జిల్లా విజిలెన్స్ అధికారి పద్మనాభ స్వామి, ఎస్టీఎం వేణు, ఎస్ఆర్‌పీలు చారీ, మౌనిక, ఎంపీడీఓ విజయ్ కుమార్, ఎంపీఓ కూచన ప్రకాశ్, ఏపీఎం వెంకట్ నారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, డీఆర్‌పీలు, వీఆర్‌పీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ సంపత్ రావు

అన్నదాతలు ఆందోళన వద్దు..



దుగ్గొండి: మిరపతోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పెద్ది



గీసుకొండ: గంగదేవిపల్లిలో మొక్కజొన్న చేనును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చల్లా

- ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా

దుగ్గొండి: వడగళ్ల వానతో నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని, ఎవరు ఆందోళన చెందవద్దని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చాపలబండ, అడవిరంగాపురం, మదిర, మందపల్లి, రాజ్యాతండా, గోబ్రియాతండా గ్రామాల్లో సోమవారం పర్యటించారు. నష్టపోయిన మిరప, వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. కన్నీటి పర్యంతం అవుతున్న అన్నదాతలను ఓదార్చారు. అండగా ఉంటానని అధైర్య పడొద్దని సముదాయించారు. అక్కడి నుంచే కలెక్టర్ ప్రావీణ్యతో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే పంట నష్టం సర్వే చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. వ్యవసాయశాఖ డీఏఓ ఉషాదయాళ్‌లను గ్రామాలలో వందశాతం రైతులందరికి పరిహారం అందించే విధంగా నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమల, ఏఓ దయాకర్, హెచ్‌ఓ జ్యోతి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సాయం అందేలా చూస్తాం: ఎమ్మెల్యే చల్లా

గీసుకొండ: ఇటీవల కురిసిన వడగళ్ల వర్షంతో నష్టపోయిన కౌలు రైతులను ఆదుకుంటామని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సోమవారం గంగదేవిపల్లి వద్ద నేలవాలిన మొక్కజొన్న చేలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రకృతి ప్రకోపం రైతులకు శాపంగా మారడం దురదృష్టకరమన్నారు. కౌలుకు తీసుకుని సాగు చేసిన రైతులకు పరిహారం అందేలా అధికారులు నివేదికలు రూపొందించాలన్నారు. జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, తహసీల్దార్ విశ్వనారాయణ, ఏఓ హరిప్రసాద్‌బాబు, సర్పంచ్‌లు గోనె మల్లారెడ్డి, బోడకుంట్ల ప్రకాశ్, అంకతి నాగేశ్వర్‌రావు, జయపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం

- కలెక్టర్ పి. ప్రావీణ్య
- ప్రజావాణిలో 45 అభ్యర్థనలు

వరంగల్ రూరల్: ప్రజాసమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజల నుంచి కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అశ్విని తానాజీ వాకడే, ఆర్డీఓ మహేందర్‌జీ అభ్యర్థనలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిలో అన్ని శాఖల అధికారులు విధిగా పాల్గొనాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు అందుకు సంబంధించిన ఫొటోలను జిల్లా అధికారులు వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేయాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించి 45 దరఖాస్తులు రాగా అత్యధికంగా భూ సమస్యలపై వచ్చాయి.



ప్రజల నుంచి అభ్యర్థనలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

దళితులకు మూడు ఎకరాల భూమి ఇవ్వాలి



జిల్లాలో భూమి లేని దళితులకు మూడు ఎకరాల భూమి ఇవ్వాలి. ప్రభుత్వ, సంక్షేమ కార్యక్రమాలకు అర్హులైన నిరుపేద దళితులకు వర్తింపజేయాలి. తిర్మలాయపల్లి గుట్ట వద్ద ఉన్న భూములు దళితులకు కేటాయించాలి.

-బరిగెల బాబు, తిర్మలాయపల్లి, రాయపర్తి

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

వడగళ్ల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలి. వరి, మొక్కజొన్న, మిర్చి తదితర పంటలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించాలి. ఎకరాకు రూ.50వేల నష్ట పరిహారం అందించాలి.

-సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథానాయకులు



'టాస్' అసోసియేట్ ఫెల్లోగా నాగయ్య



నాగయ్యను అభినందిస్తున్న వీసీ రమేష్, రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు

కేయూ క్యాంపస్: తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (టాస్) అసోసియేట్ ఫెల్లోగా కాకతీయ యూనివర్సిటీ మ్యాథ్‌మెటిక్స్ విభాగం కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.నాగయ్య ఎంపికయ్యారు. నాగయ్య ఆ విభాగంలో 13 సంవత్సరాలుగా కాంట్రాక్టు అసోసియేట్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. 20 సంవత్సరాలపాటు బోధనానుభవం ఉంది. జాతీయ , అంతర్జాతీయ సదస్సుల్లో 30వరకు పరిశోధన పత్రాలు సమర్పించారు. ఒక మైనర్ రీసెర్చ్ ప్రాజెక్టు పూర్తి చేశారు. గతంలో ఏపీ, తెలంగాణ సొసైటీ ఫర్ మ్యాథ్‌మెటికల్ సైన్స్‌కు ప్రధాన కార్యదర్శిగా, పాలకమండలి సభ్యుడిగా సేవలు అందించారు. త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించబోయే ఇండక్షన్ కార్యక్రమంలో ఈ అవార్డుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను తీసుకోనున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్

విద్యారణ్యపురి: ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులన్నీ ఈ నెలాఖరులోగా చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండలోని సంఘ కార్యాలయంలో వరంగల్ జిల్లాస్థాయి సమావేశం సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఆర్సీ ఎరియర్స్, సరెండర్ లీవు బిల్లులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎఫ్ రుణాలు, పార్ట్ ఫైనల్ టీఎస్‌జీఏఎల్ఐ రుణాలు తదితర అనేక బిల్లులు ఈ కుబేర్‌లోనే పెండింగ్‌లో పెట్టడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైద్య ఖర్చులకు ఇచ్చే మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపు, ఉద్యోగ విరమణ పొందితే వచ్చే బెనిఫిట్స్ బిల్లులు కూడా జాప్యం అవుతున్నాయన్నారు. ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టబోతున్నామని, టీపీటీఎఫ్ బాధ్యులతోపాటు ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు జె.స్వామి, జి.లక్ష్మీపతి, కార్యదర్శులు వి.రవీందర్, ఎండి.తన్వీర్, పూర్వ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్కూరు అశోక్, బాధ్యులు మునిపాటి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కడారి భోగేశ్వర్

పన్నుల వసూళ్లలో ముందంజ

- 81 శాతం పూర్తి చేసిన నర్సంపేట మండల పరిషత్ కార్యాలయం

నర్సంపేట రూరల్: ఇంటి, నల్లా, ఇతర పన్నుల వసూళ్లలో నర్సంపేట మండలం ముందంజలో నిలిచింది. జిల్లాలోని 11 మండలాల్లో 323 గ్రామాలు ఉండగా నర్సంపేట మండలం 81 శాతం పనులు వసూలు చేసింది. నెలాఖరు వరకు వంద శాతం పన్నులు వసూలు చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నారు. నర్సంపేట మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలకుగాను మొత్తం రూ.49,89,453 కాగా అందులో రూ.40,24,888లు వసూలు చేయగా రూ. 9,64,565లు మాత్రమే మిగిలి ఉంది. వందశాతం పన్నులు వసూలు చేసి జిల్లాలో ఆదర్శ మండలంగా నిలపాలని అధికారులు కృషి చేస్తున్నారు.



నర్సంపేట ఎంపీడీఓ కార్యాలయం

వందశాతం పూర్తి చేస్తాం..



నర్సంపేట మండలంలో ఇంటి, నల్ల పన్నులు ఇప్పటి వరకు 81 శాతం పూర్తి చేశాం. అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది సహకారంతో వారం, పది రోజుల్లో వందశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

-సునీల్‌కుమార్ రాజ్, ఎంపీఓ, నర్సంపేట

మండలాల వారీగా వసూలైన పన్నుల వివరాలు.. (రూపాయల్లో)

మండలాలు	గ్రామాలు	పన్నులు	వసూలైనవి	రావాల్సినవి	శాతం
నర్సంపేట	27	49,89,453	40,24,888	9,64,565	81
గీసుగొండ	21	34,19,306	27,86,666	6,32,640	81
పర్వతగిరి	33	37,61,175	29,13,126	8,47,795	77
దుగ్గొండి	34	40,62,123	30,35,789	1026,334	75
ఖానాపురం	20	42,52375	31,21,526	11,30,849	73
నెక్కొండ	39	50,93,158	35,51,888	15,41,270	70
రాయపర్తి	39	43,08,728	30,20,559	12,88,169	70
వర్ధన్నపేట	18	39,35,852	26,72,106	12,63,746	68
నల్లబెల్లి	27	33,10,094	20,30,044	12,76,976	61
చెన్నారావుపేట	30	28,85,460	17,10,233	11,71,244	59
సంగెం	33	46,12,372	26,76,382	19,35,783	58

వ్యర్థాల నిర్వీర్యానికి కార్యాచరణ

వరంగల్ అర్బన్: జూలై నెలాఖరు నాటికి రెండు లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను నిర్వీర్యం చేసే దిశగా కార్యాచరణ రూపొందించాలని నగర మేయర్ గుండు సుధారాణి, ఇన్‌చార్జ్ కమిషనర్, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం బల్దియా పరిధిలోని 46వ డివిజన్ రాంపూర్ డంపింగ్ యార్డులో చేపట్టిన బయో మైనింగ్ ప్రక్రియ పనితీరును మేయర్, కలెక్టర్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి పలు సూచనలు చేశారు. బయో మైనింగ్ ద్వారా చెత్త నిర్వీర్యం చేస్తున్న రికార్డులను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. డంపింగ్ యార్డులో 3 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త ఉండగా.. ఇప్పటివరకు లక్ష మెట్రిక్ టన్నులను బయో మైనింగ్ ద్వారా నిర్వీర్యం చేశారన్నారు. మిగిలిన వ్యర్థాలను సకాలంలో నిర్వీర్యం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నిర్వీర్యంతో వెలువడిన అంత్య ఉత్పన్నాలు, ఆర్‌డీఎఫ్‌లను సిమెంట్ ఫ్యాక్టరీలకు తరలించడంతోపాటు రైతులు పొలాల్లో ఉపయోగించుకునే విధంగా వ్యవసాయ శాఖ ద్వారా చైతన్యం కల్పించాలని ఆదేశించారు. తనిఖీల్లో కార్పొరేటర్ సరోజన, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌ఓ రాజేశ్, ఈఈ సంజయ్, స్మార్ట్ సిటీ ప్రతినిధి ఆనంద్ ఓలేటి, ఏఈ వెంకటేశ్వర్లు, సైట్ ఇంజనీర్లు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



బయో మైనింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న మేయర్

24న విద్యుత్ సౌధ ఎదుట ధర్నా

పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచాలి

రైల్వే లోకో పైలెట్లా.. రోబోలా?

- వివరాలు 10లో▸

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి


ముళ్లపొదల్లో కృష్ణ మృతదేహం

కాజీపేట అర్బన్: ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి పడడంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన కాజీపేట మండలం అమ్మవారిపేటలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మడికొండ ఎస్సై నర్సింహరాజు తెలిపిన వివరాల ప్రకారం.. వర్ధన్నపేటలోని రాయపర్తి మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన బొజ్యన కృష్ణ (36) మహబూబాబాద్ జిల్లాలోని కురవి మండలం బీబీనగర్ తండాలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. తన భార్య రాధిక స్వగ్రామం మడికొండకు ఇటీవల తమ సమీప బంధువులు మృతి చెందగా వచ్చాడు. ఆదివారం రంగశాయిపేటలోని బంధువులను కలిసేందుకు తన ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి మడికొండకు వస్తున్న క్రమంలో అమ్మవారిపేటకు రాగానే బైక్ అదుపుతప్పి ముళ్లపొదల్లో పడిపోయాడు. సోమవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేయడంతో ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతుడి భార్య రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లిని తండ్రి వేధిస్తున్నాడని కుమారుడి ఆత్మహత్య


బర్ల శ్రీకాంత్(ఫైల్)

గీసుకొండ: తండ్రి తరచుగా మద్యం సేవించి ఇంటికి వచ్చి తన తల్లితో గొడవపడుతూ వేధిస్తుండటంతో మనస్తాపం చెందిన యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారానికి చెందిన బర్ల శ్రీనివాస్, స్వరూప దంపతులకు కూతురు, కుమారుడు ఉండగా కూతురు వివాహం జరిగింది. కుమారుడు బర్ల శ్రీకాంత్(27) డిగ్రీ వరకు చదువుకుని ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. తండ్రి కూలీ పనికి వెళ్లి తరచుగా తాగి వచ్చి తన తల్లి స్వరూపను తిడుతూ.. కొడుడూ ఉండేవాడు. ఆదివారం రాత్రి కూడా తండ్రి తాగివచ్చి తన తల్లితో గొడవ పడటంతో శ్రీకాంత్ ఆమెను ధర్మారంలోని బంధువుల ఇంటికి పంపించాడు. తిరిగి తన ఇంటికి వెళ్లి గది తలుపులు మూసి ఇంటిలోని దూలానికి ఉరి వేసుకున్నాడు. సోమవారం ఉదయం అతడి తల్లి వచ్చి కిటికీలో నుంచి చూడగా అప్పటికే దూలానికి వేలాడుతూ మృతి చెంది ఉన్నాడని మృతుడి బంధువులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు తెలిపారు.

ప్రభుత్వ ఖజానాకు టోకరా..

- నకిలీ వే బిల్లులతో ఇసుక రవాణా
- పోలీసులకు చిక్కిన ముఠా
- ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం
- విలేకరుల సమావేశంలో సీపీ రంగనాథ్


మాట్లాడుతున్న సీపీ రంగనాథ్, పక్కన అధికారులు

వరంగల్ క్రైం : నకిలీ వే బిల్లులు సృష్టించి ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయలు గండికొట్టిన ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వీ రంగనాథ్ తెలిపారు. సోమవారం కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రంగనాథ్ మాట్లాడారు. ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా, బిల్లులు ఎలాంటి తేడాలు కనిపించకుండా నకిలీలు సృష్టించి అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న 10 మంది ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. నిందితులు యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ మండలం పుట్టపాక గ్రామానికి చెందిన ఏదుల కిరణ్, ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు గ్రామానికి చెందిన షేక్ ఇమ్రాన్, హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన గంట ప్రదీప్‌రెడ్డి, భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మంచెళ్ల వెంకటేశ్, ఎల్కతుర్తి మండలం దామెరకు చెందిన పర్లపల్లి శ్రీకాంత్, ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లికి చెందిన రాజశేఖర్ గౌడ్, యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం సాయిగోన్ బావికి చెందిన బండమిద్ది స్వామి, అరుట్ల రాజు, రంగారెడ్డి జిల్లా మంచెల్ మండలం లోయపల్లి గ్రామానికి చెందిన బూడిద శివ, నల్గొండ జిల్లా దిండ్ మండలం గౌరారం గ్రామానికి చెందిన జోగు సైదులులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లికి చెందిన చరణ్‌గౌడ్, ఏటూరునాగారం మండలం ఆకులవారి ఘన్‌పూర్‌కు చెందిన యనమళ్ల రాకేష్, ఆత్మకూరు మండలం ఊరుగొండ గ్రామానికి చెందిన ముత్యాల రామన్న, యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం వావిలాళ్లపల్లికి చెందిన బచనగోని యాదగిరిలు పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. నిందితుల నుంచి 65 నకిలీ వే బిల్లులు, టీఎస్ఎండీసీ 16 స్టాంప్‌లు, 16 లారీలు, 11 సెల్‌ఫోన్‌లు, 1 ట్యాప్‌లాప్, రూ.41వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఆదాయానికి గండి

ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుం చెల్లించకుండా నిందితుల కంప్యూటర్ ద్వారా ఈ ముఠా ఇప్పటికి సుమారు 1,700 వే బిల్లులు సృష్టించి కోట్ల రూపాయలు కొల్లగొట్టారని పేర్కొన్నారు. ఈ ముఠా సభ్యుల్లో లారీ ఓనర్ల పై కూడా కేసులు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వానికి ఇసుక లోడింగ్ కోసం 12 టైర్ల లారీ ఓనర్లు రూ.10,238, 14 టైర్ల ఓనర్లు రూ.13,085 , 16 టైర్ల ఓనర్లు రూ.14,800 చెల్లించి డీడీలను టీఎస్ఎండీసీకి చెల్లించి ఇసుక లోడింగ్ చేసుకుంటారని, అలా కాకుండా కంప్యూటర్ పై అవగాహన ఉన్న ఏదుల కిరణ్‌కుమార్ నకిలీ వే బిల్లులను క్యూఆర్ కోడ్‌తో సహా సృష్టించి ప్రభుత్వానికి ఆదాయం రాకుండా చేసారని సీపీ తెలిపారు. కొంతమంది దళారులను ఏర్పాటు చేసుకొని లారీ ఓనర్లతో నేరుగా సంబంధాలను ఏర్పాటు చేసుకొని గత కొంతకాలంగా ఈ ముఠా రాష్ట్రంలోని 37 ఇసుక రీచ్‌లలో దందా కొనసాగిస్తున్నదని సీపీ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ వే బిల్లుల దందా కొనసాగిందని ఆయన పేర్కొన్నారు. విచారణ ప్రాథమిక దశలో ఉందని వారం పదిరోజుల్లో ఈ ముఠాకు సంబంధించిన అన్ని వ్యవహారాలను వెలికి తీస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మట్టెవాడ, టాస్క్‌ఫోర్స్ పోలీసులను సీపీ అభినందించారు. విలేకరుల సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ బారీ, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ డాక్టర్ జితేందర్‌రెడ్డి, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ జనార్ధన్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వర్లులను సీపీ అభినందించారు.

నడుస్తున్న ఆటోపై విరిగిపడిన చెట్టు


ఆటోపై పడిన చెట్టు


ఆస్పత్రిలో చికిత్స చేస్తున్న వైద్యులు

- ఏడుగురికి గాయాలు
- ఆస్పత్రికి తరలింపు

ఏటూరునాగారం: కూలీలు, విద్యార్థులతో వెళ్తున్న ఆటోపై రోడ్డు పక్కనే ఉన్న చెట్టు విరిగిపడి ఏడుగురు గాయపడిన ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. మండలంలోని కొండాయికి చెందిన ఆటో డ్రైవర్ బొల్లికొండ శ్రీకాంత్ తన ఆటోలో మల్యాలకు చెందిన పిచ్చి నర్సమ్మ, పాయం జగ్గమ్మ, పాయం సాయన్న, షాపెల్లికి చెందిన విద్యార్థి బీఏ ఫైనలియర్ వావిలాల దుర్గప్రసాద్, కొండాయికి చెందిన దబ్బగట్ల సారక్క, శివరంజితో కొండాయి నుంచి ఏటూరునాగారం వస్తున్నారు. చిన్నబోయినపల్లి - ఏటూరునాగారం మార్గమధ్యలోని వట్టివాగు వద్దకు రాగానే ఎండిపోయి ఉన్న భారీ వృక్షం రాత్రి వర్షం వల్ల నడుస్తున్న ఆటోపై విరిగి పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న పిచ్చి నర్సమ్మకు ఎడమ చేయి, పాయం జగ్గమ్మ ఎడమ భుజానికి, వావిలాల దుర్గ ప్రసాద్‌కు ఎడమకాలుకు తీవ్ర గాయాలుకాగా డ్రైవర్ శ్రీకాంత్, శివరంజి, సాయన్న, సారక్కలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి 108లో తరలించి చికిత్సలు అందించారు. చెట్టు ఆటో పై పడడంతో 163 జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ అయింది. ఆటోపై పడిన చెట్టును గ్రామస్తులు, ప్రయాణికుల సాయంతో తొలగించి క్షతగాత్రులను కాపాడారు. ఆటో నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ లబోదిబోమంటున్నారు.


గాయపడిన పిచ్చి నర్సక్క

ఆలయంలో నాలుగుసార్లు చోరీ

- సిద్దేశ్వరాలయంలో తరచూ దొంగతనాలు
- అయినా మారని తీరు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ సంపత్‌రావు

చెన్నారావుపేట: అది మండల కేంద్రంలోని ఆలయం.. తరచూ చుట్టూ జనాలు సంచరిస్తూనే ఉంటారు.. అయినా.. ఆ ఆలయంలో తరచూ దొంగతనాలు జరుగుతుండడం గమనార్హం. ఇప్పటికే ఆలయంలో నాలుగుసార్లు దొంగతనం జరగడం చూస్తుంటే.. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. సిద్దేశ్వరాలయం పూజరులు సోమవారం రోజువారీ పూజలు చేయడానికి ఆలయం చేరుకున్నారు. గుడి వద్దకు రాగా తాళాలు పగులగొట్టి ఉండడాన్ని చూసి, విషయాన్ని ఆలయకమిటీ చైర్మన్ కంది గోపాల్‌రెడ్డితో పాటు పోలీసులకు తెలియజేశారు. ఘటనా స్థలానికి ఏసీపీ సంపత్‌రావు, సీఐ హతిరామ్, ఎస్సై తోట మహేందర్‌లు చేరుకుని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ తాళాలు పగుళగొట్టి, హుండీని ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. అయితే హుండీలో సుమారుగా రూ.50వేల వరకు ఉన్న నగదు ఉంటుందని అర్చకులు, పోలీసులు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. పోలీస్ స్టేషన్ సమీపంలోని పొలాల్లో హుండీలు పడేయడం గమనార్హం.

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి

- ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ శేషు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శేషు

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శేషు మాట్లాడారు. వ్యక్తులు చేసిన తప్పులు వ్యవస్థకు అపాదించడం సరైంది కాదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని విమర్శించారు. వ్యక్తులు వ్యవస్థల భాగమేనని గుర్తించాలన్నారు. టీఎస్‌పీఎస్సీలో జరిగిన తప్పిదాల నుంచి ప్రభుత్వం తప్పించుకోవాలనుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సమైక్యాంధ్రప్రదేశ్‌లోను అప్రతిష్ట మూటగట్టుకున్న ఏపీపీఎస్సీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో ఏర్పాటైన టీఎస్‌పీఎస్సీ కూడా అదే దారితో నడుస్తుందని ఘూర్పారబట్టారు. ప్రశ్నాపత్రాల లీక్, ప్రశ్నాపత్రాల్లో తప్పులు, భర్తీ ప్రక్రియలో జాప్యం వంటి అనేక తప్పిదాలతో టీఎస్‌పీఎస్సీ నిరుద్యోగుల్లో విశ్వాసం కోల్పోయిందన్నారు. ఈ క్రమంలో టీఎస్‌పీఎస్సీని సమూలంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్, మెయిల్ ద్వారా ప్రక్షాళనకు చెందిన సూచనలను ఇప్పటికే పంపామని, లేఖ ద్వారా పంపనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రజా వేదిక నాయకులు సతీష్, చిన్నాల యశ్వంత్ యాదవ్, అజయ్, నరేందర్, దానేశ్వర్, జితేందర్, కిరణ్, బోస్ పాల్గొన్నారు.

తెలంగాణకు రెండో బహుమతి


బహుమతితో జీవిత

వరంగల్(పర్వతగిరి): జైపూర్‌లో గత మూడు రోజులుగా నిర్వహించిన స్క్వాష్ రాకెట్ పోటీలకు గాను తెలంగాణకు రెండో బహుమతి లభించింది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ఇస్లావత్‌తండాకు చెందిన జీవిత పోటీల్లో నైపుణ్యం సాధించి రెండో బహుమతికి దోహదపడింది. దేశవ్యాప్తంగా పది టీంలు పాల్గొనగా మొదటి బహుమతి మహారాష్ట్ర దక్కించుకోగా, రెండో బహుమతి తెలంగాణ కైవసం చేసుకుంది. గతంలో అథ్లెటిక్ పోటీల్లో జాతీయ స్థాయిలో.. ప్రస్తుతం స్క్వాష్ పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించడం గర్వంగా ఉందని ఆమె తెలిపారు.

మావోయిస్టు సానుభూతిపరుల అరెస్ట్


అరెస్ట్ చూపుతున్న ఎస్పీ గాష్ ఆలం

ములుగు: మావోయిస్టులకు సహకరిస్తేకఠినంగా కఠిన చర్యలు తీసుకుంటామని ములుగు ఎస్పీ గాష్ ఆలం హెచ్చరించారు. ఈ మేరకు అనుమానితంగా పేలుడు పదార్థాలను తరలిస్తున్న ఎనిమిది మంది నిషేధిత సీపీఐ మావోయిస్టు సానుభూతిపరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని పోలీసు సాయుధ కార్యాలయంలో ఎస్పీ గాష్ ఆలం విలేకరుల సమావేశంలో అరెస్ట్ చూపించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో వెంకటాపురం(కె) మండలం రామచంద్రాపురం శివారులో కొంతమంది కారు, ద్విచక్రవాహనంపై అనుమానస్పదంగా ప్రయాణిస్తున్నారని తెలుసుకున్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు వారిని వెంబడించారు. కారు, ద్విచక్రవాహనాన్ని వెంబడించి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వాహనంలోని పేలుడు పదార్థాలు, ఐఈడీ మెటీరియల్‌లోని లోహభాగాలు, విప్లవ, సాహిత్య పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో మావోయిస్టు అగ్రనేత దామోధర్, చంద్రన్నతో కలిసి , మరికొంత మంది సభ్యులు భూ సమస్యలను పరిష్కరించడానికి చేస్తున్న విప్లవ భావజాలానికి ఆకర్షితులయ్యారు. దామోదర్ సూచనల మేరకు కూంబింగ్ ఆపరేషన్ల కోసం అడవికి వచ్చే పోలీసులను చంపాలనే ఉద్దేశంతో పేలుడు పదార్థాలను తరలిస్తూ కనిపించారు. పట్టుబడిన వారిని విచారించగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా నాగారం గ్రామానికి చెందిన అందె రవి, వరంగల్ జిల్లా సంగెం మండలం పల్లారుగూడ గ్రామానికి చెందిన శ్రీరామోజు మనోజ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన దిడ్డి సత్యం, సంగెం మండలానికి చెందిన శ్రీరామోజు భిక్షపతి, మల్హర్ మండలం పెద్దతండా గ్రామానికి చెందిన అనసూరి రాంబాబు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాప్రా మండలానికి చెందిన గణపురం చంద్రమౌళి, కాప్రా మండలానికి చెందిన పృధ్వీరాజ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నాగారానికి చెందిన అందె మానసగా తెలిసింది. నిందితులు అందరిపై కేసులు ఉన్నట్లుగా ఎస్పీ తెలిపారు. వారి నుంచి ఐఈడీఎస్-45 యొక్క ఇనుప భాగాలు, 10 మీటర్ల కార్డెక్స్ వైర్, రెండు డిటోనేటర్లు, ఒక బ్యాటరీ, నాలుగు విప్లవ సాహిత్యాలు, మధుమేహం, ఇతర అనారోగ్య సమస్యలకు సంభందించిన మాత్రలు, కారు బేరింగ్, హోండా మోటార్ ద్విచక్రవాహన బేరింగ్, ఎనిమిది మొబైల్ ఫోన్లు, రూ. 4140 నగదు పట్టుబడినట్లు తెలిపారు. సంఘటన ఆధారంగా వెంకటాపురం(కె) పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశామని అన్నారు. సమావేశంలో ఓఎస్డీ అశోక్‌కుమార్, ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, వెంకటాపురం(కె) సీఐ శివప్రసాద్, ఎస్సై తిరుపతిరావు పాల్గొన్నారు.

ఆబ్కారీ చేతివాటం

- పట్టుకున్న నల్లబెల్లం అమ్మకానికి తరలింపు
- గుట్టు రట్టు చేసిన మరిపెడ పోలీసులు
- సోషల్ మీడియాలో వైరల్


పట్టుబడిన తొర్రూరు ఎక్సైజ్ బెల్లం వాహనం

మరిపెడ రూరల్: అక్రమ వ్యాపారాలు ఆట కట్టించే ఆబ్కారీ పోలీసులు చేతివాటం ప్రదర్శించారు. ఓ వేలం వేసిన వాహనంలో అక్రమంగా నల్ల బెల్లం తరలించి అమ్మడానికి డంపుచేస్తుండగా మరిపెడ పోలీసులు పట్టుకుని గుట్టురట్టు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఎక్సైజ్ పరిధిలో అక్రమంగా నల్లబెల్లం తరలిస్తున్న పలు వాహనాలను అబ్కారి ఆధ్వర్యంలో ఇటీవల వేలం వేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు వేలం పాటలో వాహనాలు దక్కించుకున్నారు. ఈ ఇదే అదునుగా భావించిన ఎక్సైజ్ అధికారులు చేతి వాటం ప్రదర్శించారు. అనుకూలంగా ఉన్న ఓ బెల్లం బస్తాల లోడ్ వాహనాన్ని అర్ధరాత్రి అక్రమంగా తరలించారు. మరిపెడ మండలంలోని యలమంచిలితండాలో శివారులో డంప్ చేస్తున్నారు. తండా వాసుల సమాచారం మేరకు విషయం తెలుసుకున్న మరిపెడ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి సదరు వాహనాన్ని పట్టుకొని మరిపెడ పోలీస్టేషన్‌కు తరలించారు. తమదైన శైలిలో డ్రైవర్ విచారించడంతో అసలు విషయం బయటకు పొక్కింది. వెంటనే మేల్కొన్న అబ్కారీ అధికారి తమ ఆధీనం నుంచే బెల్లం లోడ్ వాహనం అటు వైపుగా వచ్చిందని లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చి వాహనాన్ని తొర్రూరు తీసుకెళ్లారు. కంచె చేను మేసిన చందంగా తొర్రూరు ఎక్సైజ్ పోలీసుల తీరు ఉందని ప్రజలు అవాక్కవుతున్నారు. ఈ వ్యవహారమంతా సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం గమనార్హం. ఈ విషయంపై తొర్రూరు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా. వేలం వేసిన వాహనం విజయవాడకు వెలుతుంది. తమ తప్పిదం వల్ల బెల్లం బస్తాలు అందులోనే ఉండిపోవడంతో మరిపెడ పోలీసులు పట్టుకొని సమాచారం ఇచ్చినట్లు సదరు అధికారి పేర్కొన్నారు.

ఆన్‌లైన్ మాయ

కాజీపేట: కాజీపేట పట్టణానికి చెందిన ఓ యువతి ఆన్‌లైన్‌లో గుర్తు తెలియని వ్యక్తుల మాటలు నమ్మి రూ.30వేలు నష్టపోయింది. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేటకు చెందిన యువతి ఓఎల్‌ఎక్స్ అప్లికేషన్స్ పరిశీలిస్తుండగా అందులో ఒక పల్సర్ బైక్ అమ్మకానికి ఉండగా కింద ఉన్న నంబర్‌కు ఫోన్ చేసి బేరం కుదుర్చుకుంది. జీఎస్టీ, ట్రాన్స్‌ఫోర్ట్ ఛార్జీల కింద మోసగాళ్లు చెప్పినట్లుగా డబ్బులను చెల్లించింది. ఆ తర్వాత అటువైపు నుంచి సమాధానం లేకపోవడంతో మోసపోయినట్లుగా గుర్తించి ఫిర్యాదు చేయగా విచారణ జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

గంజాయి స్మగ్లింగ్ ముఠా అరెస్టు


గంజాయిని పరిశీలిస్తున్న సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం : ఎండు గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు, సరఫరాకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను మిల్స్‌కాలనీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వీ రంగనాథ్ తెలిపారు. సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీ రంగనాథ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, ఒడిషా రాష్ట్రాల నుంచి భద్రాచలం మీదుగా వరంగల్‌కు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని కమ్మంపాటి సుమంత్, పాకాల సాయికుమార్, ములుగు వికాస్ అలియాస్ విక్కీలను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.60 వేల విలువగల మూడు కిలోల ఎండు గంజాయి, 2 సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడు శివనగర్‌కు చెందిన కమ్మంపాటి సుమంత్ కరీంనగర్‌లో కొబ్బరి బోండాల వ్యాపారం చేసుకుంటూ ఎవరికి అనుమానం రాకుండా గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడేవాడని తెలిపారు. సుమంత్ స్నేహితులైన పాకాల సాయికుమార్, ములుగు వికాస్‌లు ఎవరికి అనుమానం రాకుండా వరంగల్, మహబూబాబాద్ మీదుగా భద్రాచలం నుంచి ఒడిషాలోని కలిమెలకు ద్విచక్ర వాహనం పై చేరుకొని అక్కడ మొద్దు అలియాస్ భాయ్ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి తిరిగి వరంగల్‌కు చేరుకొని 100 గ్రాముల గంజాయిని రూ.500, రూ.700, రూ.1000 చొప్పున అమ్మే వారని తెలిపారు. వరంగల్‌లోని శివనగర్, కాశిబుగ్గ, కరీమాబాద్, ఖిలా వరంగల్, చింతల్, లేబర్‌కాలనీ ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు చేపట్టినట్లు సీపీ తెలిపారు. కొంతమంది పాఠశాల, కళాశాల విద్యార్థులకు గంజాయిని అలవాటు చేసి వారి ద్వారా గంజాయి విక్రయాలు చేపట్టినట్లు తెలిపారు. 15 మంది గంజాయి విక్రయదారులు, 50 మంది వినియోగదారులను ఆదివారం రాత్రి ఖిలా వరంగల్‌లోని రాతికొండ దగ్గరకు వస్తున్నారనే సమాచారంతో వెళ్లగా ముగ్గురు నిందితులు పట్టుబడినట్లు తెలిపారు. ఇప్పటి వరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు 13 మంది గంజాయి అమ్మకందారులను అదుపులోకి విచారిస్తున్నట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు గంజాయి సేవించే వారిని 159 మందిని గుర్తించి కమిషనరేట్‌లోని ఆరు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని 14 మందిని జైలుకు పంపించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. గంజాయి స్మగ్లర్లను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ డాక్టర్ జితేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రావు, ఎస్సైలు వడ్డెబోయిన లవణ్‌కుమార్, నిస్సార్ పాషా, కానిస్టేబుళ్లు రాజేష్, రాజు, బిక్షపతి, శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్, నవీన్‌లను సీపీ నగదు రివార్డులతో అభినందించారు.

నల్లబెల్లం స్వాధీనం.. కేసు నమోదు


మరిపెడలో పట్టుబడిన బెల్లం లోడ్ నిందితులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మరిపెడ రూరల్: అక్రమంగా రవాణ చేస్తున్న 21 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టుకున్నట్లు వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఎస్సై మధు సోమవారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం స్టేజి నుంచి వయా విస్సంపల్లి, ఎల్లంపేట మీదుగా సోమ్లతండాకు ఓ వాహనంలో బెల్లం తరలిస్తున్నట్లు సమాచారం మేరకు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 42 బస్తాల్లోని 21 క్వింటాళ్ల నల్ల బెల్లాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి సోమ్లతండాకు చెందిన గుగులోతు నవీన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లాకు చెందిన పుల్లారెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దాడుల్లో సత్యప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రావణ్, మధార్ పాల్గొన్నారు.